ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

శనివారం 14 జూన్ 2025



నేడు జాతీయ లోక్ అదాలత్

కోల్‌సిటీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజమార్గమని, శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు పాల్గొని విజయవంతం చేయాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టీ శ్రీనివాసరావు తెలిపారు. లోక్ అదాలత్‌లో చెక్ బౌన్స్, గృహ హింస, వరకట్న వేధింపులు, ఇతర రాజీకాగల క్రిమినల్ కేసులు రాజీ కుదుర్చుకోవచ్చని, సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

నష్టపోయిన రైతులకు ఉచిత న్యాయసాయం

● రైతులకు అవగాహన సదస్సులో జడ్జి స్వరూపరాణి



ఓదెల రైతు వేదికలో చట్టాలపై వివరిస్తున్న జడ్జి స్వరూప రాణి

ఓదెల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు, మధ్యదళారులు, విత్తన కంపెనీల వల్ల నష్టపోయిన రైతాం గానికి ఉచిత న్యాయం అందిస్తామని న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్, జడ్జి స్వరూపరాణి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం చట్టాలపై మండలంలోని రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి స్వరూపరాణి మాట్లాడుతూ విత్తనాల వల్ల నష్టపోతే వినియోగదారుల ఫోరంలో కేసు ఎలా వేయాలో రైతులకు అవగాహన ఉండాలన్నారు. విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేస్తే బిల్లులను తప్పనిసరిగా తీసుకోవాలని, బిల్లులు ఇవ్వని షాపుల్లో కొనుగోలు చేయవద్దని తెలిపారు. మధ్య దళారులను సంప్రదించవద్దని, విత్తనాలు కొనుగోలు చేసే ముందు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలన్నారు. రైతులను మోసం చేసే వారిపై ఎలా కేసు వేయాలో రైతులకు వివరించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉంటేనే సమాజంలో నేరాల ప్రవృత్తి తగ్గుతుందని, తొందరగా న్యాయం అందుతుందని తెలిపారు. ఏడిఏ శ్రీనాథ్, ఏవో భాస్కర్, ఆర్‌ఐ,ఏఈఓ, అడ్వకేట్లు పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు సహకరించాలి



నిల్వ నీటిని పారబోయిస్తున్న డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి

కోల్‌సిటీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు సహకరించాలని రామగుండం డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి పేర్కొన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్ష్మీపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగించారు. నీరు నిల్వ ఉండకుండా చూడడం, నిల్వ నీటిలో ఆయిల్‌బాల్స్ వేయడం, ఫాగింగ్ చేపడుతున్నామన్నారు. ఇంటి పరిసరాల్లో ఎయిర్ కూలర్లు, పాత టైర్లు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు మొదలైన వాటిలో నీరు నిల్వ కుండా జాగ్రత్త పడాలన్నారు. కాలువల్లో పూడిక తొలగించడంతో పాటు ఎయిర్ కూలర్లు, డ్రమ్ముల్లో నిల్వ ఉన్న నీటిని మున్సిపల్ సిబ్బంది తొలగించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగభూషణం, కుమారస్వామి, కిరణ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్, మెప్మా సీఓ ప్రియదర్శిని పాల్గొన్నారు.

రైతులు భూసార పరీక్షలు చేయించాలి



ప్రకృతి వ్యవసాయం పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న అధికారులు, రైతులు

ఓదెల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రైతులు భూసార పరీక్షలు చేయించి సాగు చేస్తే మంచి ఫలితాలు సాధిస్తారని ఏడిఏ శ్రీనాథ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఏడిఏ మాట్లాడుతూ వ్యవసాయంలో చాలా మార్పులు జరిగాయని, గతంలో సహజసిద్ధ వ్యవసాయం చేసి సారవంతమైన భూములను నేటి తరాలకు అందించారని తెలిపారు. విచ్చలవిడిగా పురుగుల మందులు, గడ్డి మందులను ఉపయోగించడం వల్ల భూసారం దెబ్బతిని రైతులకు పెట్టుబడులు పెరుగుతున్నాయన్నారు. నేషనల్ మిషన్ ఆన్ నాచురల్ ఫార్మింగ్ (ఎన్ఎంఎన్ఎఫ్) పథకం ద్వారా పైలట్ గ్రామంగా నాంసానిపల్లి ఎంపికైందని తెలిపారు. సహజసిద్ధ సాగు చేయాలని, భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలను సేకరించామని తెలిపారు. ఏవో భాస్కర్, విస్తరణ అధికారి సంధ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



చిన్నారులకు బిర్యాని వడ్డిస్తున్న సీడీపీవో

పెద్దపల్లి రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడి కేంద్రాల్లో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తుందని ఐసిడిఎస్ సీడీపీవో కవిత అన్నారు. శుక్రవారం అప్పన్నపేట అంగన్‌వాడి కేంద్రం-1లో సీడీపీవో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. చిన్నారులకు ఎగ్ బిర్యానిని వడ్డించారు. సీడీపీవో మాట్లాడుతూ 0-5 పిల్లలను అంగన్‌వాడి కేంద్రాల్లో చేర్చాలని, పౌష్టికాహారం, పాలు, కోడిగుడ్లు, భోజనం అందిస్తామని పేర్కొన్నారు. టీచర్ మందల విమల, సూపర్‌వైజర్‌లు స్వామి, ప్రేమలత, ప్రధానోపాధ్యాయురాలు వనజ పాల్గొన్నారు.

ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు



ఎలిగేడులో పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పాల్గొన్న ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు

● ఈ ఐదేళ్లలో రాష్ట్రంలో 20 లక్షల ఇళ్లు ఇస్తాం..

● అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణానికి నిధులు

● భూభారతిలో ప్రతీ సమస్యకు పరిష్కారం

● పోలీస్‌స్టేషన్ల ప్రారంభం, అభివృద్ధి పనుల శంకుస్థాపనలో మంత్రులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు

పెద్దపల్లి/ఎలిగేడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ఎలిగేడు, పెద్దపల్లి రూరల్, మహిళా, ట్రాఫిక్ నూతన పోలీస్ స్టేషన్ల ఆరంభం, పెద్దపల్లి పట్టణంలో రూ.4.25 కోట్లతో నిర్మించనున్న సమీకృత కూరగాయల మార్కెట్‌కు శంకుస్థాపన చేసి చందపల్లి, రాంపెల్లిలో నిర్మించిన డబుల్ బెడ్ రూముల ఇళ్లను ప్రారంభించారు. ఎలిగేడులో జరిగిన కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గత పాలకులు విచ్ఛిన్నం చేసినప్పటికీ ఇందిరమ్మ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందన్నారు.

గత పాలకుల సంక్షేమ పథకాలు కొనసాగిస్తూ అదనంగా సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజా ప్రభుత్వం చేపట్టిందన్నారు. అనేక మంది రైతులకు కన్నీళ్లు మిగిల్చిన ధరణి చట్టాన్ని రద్దుచేసి అద్భుతమైన భూభారతి చట్టం ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు. అధికారులు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారని, ప్రజలనుంచి భూ సమస్యల గురించి దరఖాస్తులు తీసుకొని క్షేత్రస్థాయిలోనే వాటిని పరిష్కరిస్తారన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సు ప్రయాణం, గురుకులాల్లో డైట్ చార్జీలు 40శాతం, కాస్మోటిక్ చార్జీలు 200శాతం పెంపు, పేదలకు సన్నబియ్యం పంపిణీ, 22వేల 500కోట్లతో 4.5లక్షల ఇందిరమ్మ ఇండ్లు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. అర్హులైన ప్రతీ పేదవాడికి ఇంది రమ్మ ఇల్లు అందుతుందని, రాబోయే 4సంవత్సరాల కాలంలో సుమారు 20లక్షల ఇందిరమ్మ ఇండ్లను కట్టాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మండల ఏర్పాటుకు చింతకుంట విజయరమణారావు కృషి చేశారని, ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాతే ఇక్కడ పోలీస్‌స్టేషన్ వచ్చిందన్నారు. ఎన్నికల సమయంలో కొందరు నాయకులు అకస్మాత్తుగా వస్తారని, ఓడిపోయిన, గెలిచిన ప్రజలతోనే ఉన్నారని మంత్రి ఎమ్మెల్యేను ప్రశంసించారు.

మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మండలం ఏర్పాటుచేసిన 24 సంవత్సరాల తర్వాత ఎమ్మెల్యే కృషి ఫలితంగా పోలీస్ స్టేషన్ ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. పోలీస్‌స్టేషన్‌కు చాలా తక్కువ మంది రావాలని, ప్రజలు శాంతియుతంగా ఉండాల న్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎలిగేడు మండలానికి అత్యధిక సంఖ్యలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యసదుపాయాలను వసతులను ప్రజాప్రభుత్వం మెరుగుపర్చిందని, కలెక్టర్ సతీమణి ఇటీవల గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో ప్రసవించిందని, ప్రభుత్వ ఆసుపత్రిని ఉపయోగించే ప్రజలలో భరోసా కల్పించి నందుకు మంత్రి కలెక్టర్‌ను అభినందించారు.

ఇందిరమ్మ ఇళ్లు అంటేనే కాంగ్రెస్..

పెద్దపల్లి ఎమ్మెల్యే సీహెచ్ విజయ రమణారావు

ఇందిరమ్మ ఇళ్లు అంటేనే కాంగ్రెస్ అని విశ్వసిస్తారని ఎమ్మెల్యే సీహెచ్ విజయ రమణారావు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో వదిలేసిన డబుల్ బెడ్ రూముల ఇళ్లను 12 నెలల్లో 6 కోట్లు వెచ్చించి మౌలిక వసతులు కల్పించి పూర్తి చేశామన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామన్నారు. ఒక దుర్మార్గుడు, మోసగాడ్ని నమ్మి రెండుసార్లు ఓటేశారని, నేను ఓడినా ప్రజలకు అందుబాటులో ఉన్నానన్నారు. 466 కుటుంబాలకు డబుల్ బెడ్ రూముల ఇళ్లు ఇవ్వడం వల్ల కడుపు నిండినట్లయ్యిందని, షుగర్ ఉన్నా కూడా ఆకలి కావడం లేదని భావోద్వేగానికి గురయ్యారు. ఏడాదిన్నర కాలంలోనే నాలుగు పోలీస్‌స్టేషన్లు, పెద్దప ల్లి బైపాస్‌రోడ్డు, ఆర్టీసీ బస్ డిపో, ఎన్నో అభివృద్ధి పను లకు నిధులు మంజూరు చేయించామన్నారు. సంక్రాంతి నాటికి ఆర్టీసీ డిపో ప్రారంభం అవుతుందని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో గణనీయంగా

మిగతా 8వ పేజీలో

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- జిల్లా విద్యాధికారి మాధవి



గర్రెపల్లిలో అక్షరాభ్యాసం చేయిస్తున్న డీఈవో మాధవి

సుల్తానాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం తీర్చిదిద్దుతోందని, అనేక వసతి సౌకర్యాలు కల్పిస్తుందని జిల్లా విద్యాధికారి మాదవి అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం డీఈవో మాట్లాడుతు పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపడ్డాయని, ప్రభుత్వం శ్రద్ధతో పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. బోధన పరికరాలు సమకూర్చడమే కాకుండా ఉన్నత విద్యావంతులైన ఉపాధ్యాయులచే బోధన అందిస్తున్న విషయాన్ని తల్లిదండ్రులు మరవరాదన్నారు. మంచి విద్య, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫారమ్స్ అందిస్తూ నాణ్యమైన భోజనం సమకూరుస్తున్నామన్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ అందించారు. గర్రెపల్లి ప్రీ ప్రైమరీ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఫర్నీచర్ లైబ్రరీ బుక్స్ ప్రొజెక్టర్‌ను ప్రారంభించారు. ఎంఈవో ఆరేపల్లి రాజయ్య మాట్లాడుతు బడిబాటలో ప్రభుత్వ పాఠశాలల వసతి, సౌకర్యాల గురించి తెలుపుతూ అడ్మిషన్లను పెంచుతున్నామన్నారు. గర్రెపల్లిలోని గొల్లవాడ ప్రభుత్వ స్కూల్‌లో కూడా అక్షరాభ్యాసం చేశారు. హెచ్ఎం వాణి, శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఐతరాజుపల్లి పాఠశాలలో కొత్తగా చేరిన వారికి గ్రామంలోని ఆలయంలో అక్షరాభ్యాసం చేయించారు. మాజీ సర్పంచ్ గుజ్జేటి వెంకన్న, మాజీ ఎంపీటీసీ భూమేష్, హెచ్ఎం కవిత, తిరుపతి రెడ్డి, శ్రీలత, జయ, రవీందర్, పర్శరాం పాల్గొన్నారు. హన్మాండ్లపల్లిలో జరిగిన కార్యక్రమంలో జయపాల్ పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

కలెక్టర్ కోయ శ్రీహర్ష



విద్యా సంవత్సరం యాక్షన్‌ప్లాన్‌పై సమీక్షిస్తున్న కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల విద్యా ప్రమాణాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష కలెక్టరేట్‌లో విద్యాసంవత్సరం యాక్షన్‌ప్లాన్‌పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. 2025-26లో తొలిమెట్టు, ఉన్నతి వంటి వివిధ కార్యక్రమాల అమలు, పిల్లల అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, పాఠశాలల తనిఖీ షెడ్యూల్ తదితర అంశాలను జిల్లా విద్యాశాఖ వారు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రాథమికంగా పిల్లలకు తెలుగు, ఆంగ్లం చదవడం, రాయడం, కనీస గణిత సామర్థ్యాలు ఉండేలా శిక్షణ అందించాలన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రతీ విద్యార్థి అభ్యాసన సామర్థ్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో కూతురిని చేర్పించిన ఉపాధ్యాయుడు



కూతురును చేర్పిస్తున్న టీచర్ కమార్

మంథని, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యా సంస్థలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీహెచ్‌ఎస్ గర్ల్స్ హెచ్ఎం సుమలత కోరారు. ఇదే పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు దొంతుల కుమార్ కూతురు మనస్వీనిని 8వ తరగతిలో శుక్రవారం చేర్పించారు. హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులు, నాణ్యమైన విద్య తోపాటు మధ్యాహ్నం భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో వేలాది రూపాయలు వృధా చేసుకోవద్దని తల్లిదండ్రులను కోరారు. టీచర్లు పోచం, మధూకర్, శ్రీనివాస్, పీడీ కొమురోజు శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

గోదావరిఖని, జూన్ 13(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా జూలై 9న నిర్వహించే అఖిల భారత సమ్మెను విజయవంతం చేయాలని జిల్లా కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జిల్లా కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు భూమల్ల చందర్ అధ్యక్షత జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ ముత్యంరావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు తోకల రమేష్‌లు మాట్లాడారు. దేశవ్యాప్తంగా వచ్చే నెల 9న జరగబోయే సమ్మెలో సంఘటిత, అసంఘటిత కార్మిక వర్గం పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక చట్టాల రక్షణ, కనీస వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, ఉపాధి హక్కుల సాధనకు సార్వత్రిక సమ్మె చేపట్టామన్నారు. సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. నాయకులు ఈ నరేష్, సారయ్య, అబ్దుల్ కరీం, శనిగరపు చంద్రశేఖర్, ఈ రాజేందర్, ఐ రాజేశం, వైకుంఠం, పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పూర్వ జిల్లా కార్యదర్శి గౌతం గోవర్ధన్ పిలుపునిచ్చారు. శుక్రవారం కాలనీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీపీఐ వందేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆవిర్భావ ఉత్సవాలను దేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. కేంద్రం, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్టు తెలిపారు. ఆగస్టులో రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని పేర్కొన్నారు. 17న కమాన్‌పూర్ మండల మహాసభ కాలనీలో జరగనున్నదని, సీపీఐ, ఏఐటీయూసీ శ్రేణులు హాజరుకావాలని కోరారు. జిల్లా మహాసభల కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. సమావేశంలో ఎల్ ప్రకాష్, రాజారత్నం, జిగురు రవీందర్, అన్నారావు, బుర్ర తిరుపతి, శ్యాంసన్, సాంబశివరావు, నారాయణ, బొంత రాజు పాల్గొన్నారు.

రేషన్ కష్టాలు

● రోజుకు 30 మందికే అందజేత

● డీలర్లకు కోటా పంపిణీలో జాప్యం

● ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు



రేషన్ దుకాణం వద్ద క్యూలో ఉన్న లబ్ధిదారులు

పెద్దపల్లిటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం తీసుకోవడంలో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం వర్షాకాలం దృష్ట్యా మూడు మాసాల బియ్యం ఒకేసారి అందజేయాలని నిర్ణయం తీసుకొంది. జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం జూన్ నెలలో సరఫరా చేయాలని, ఇందుకు ఈ నెలాఖరులోగా లబ్ధిదారులందరికీ బియ్యం పంపణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీఅయ్యాయి. ఆదివారం, పండుగ రోజుల్లో సైతం పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో జూన్ ఒక్కటికల్లా గోదాముల నుంచి కోటా బియ్యం రేషన్ డీలర్లకు చేరింది. దీంతో లబ్ధిదారులు రేషన్ దుకాణాల ముందు బారులు తీరారు.

నెలంతా సమయం ఉన్న మొదటి రోజు నుంచే రేషన్ దుకాణాల బాట పట్టారు. గంటల తరబడి లైన్లో ఉండి రేషన్ బియ్యం తీసుకెళ్తున్నారు. ఒక్కరు మూడు నెలలకు సంబంధించి మూడు సార్లు వేలి ముద్రలు వేయాల్సి ఉంటుంది. దీంతో నెట్‌వర్క్ సమస్య తలెత్తడంతో పాటు మిషన్ మొరాయిస్తుండడంతో లబ్ధిదారులు, రేషన్ డీలర్లు అసహనానికి గురవుతున్నారు. గతంలో రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సుమారు వంద మందికి వరకు బియ్యం అందజేసేవారు. ఐదారు రోజుల్లో కోట పూర్తి చేసుకునేవారు. ఇప్పుడు రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కేవలం 30 మందికి ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. దీంతో రేషన్ బియ్యం తీసుకోవాలంటే రెండు మూడు రోజులు దుకాణాల వద్దకు రావాల్సి వస్తోంది. మూడు నెలల కోటా పూర్తి స్థాయిలో రేషన్ డీలర్లకు కేటాయించలేదు. దీంతో కోటా పూర్తిగా రాని కొన్ని రేషన్ షాపులు మూసి ఉంటున్నాయి. వెంటనే కోటా అందజేయాల్సి ఉండగా ఐదారు రోజులైన డీలర్లకు బియ్యం అందడం లేదు. దీంతో లబ్ధిదారులు రేషన్ దుకాణాల చుట్టు తిరిగి వెళ్తున్నారు.

● ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు

మూడు నెలల కోటా ఒకేసారి ఇవ్వడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బియ్యం సేకరించేందుకు రెండు మూడు రోజుల పాటు పనులు వదిలి రేషన్ దుకాణం చుట్టు తిరిగి బియ్యం తీసుకోవాల్సి వస్తోంది. క్యూలైన్, నెట్‌వర్క్ సమస్య, మిషన్ మొరాయిస్తోంది. మూడు నెలల బియ్యం సుమారు ప్రతీ ఇంటికి 70 కేజీల పైగా తీసుకోవాల్సి ఉంటుంది. పెద్ద మొత్తంలో బియ్యం ఒకేసారి తీసుకొని పోవడానికి లబ్ధిదారులు ఆటో తీసుకొని వస్తున్నారు. వచ్చిన సమయంలో బియ్యం ఇవ్వకపోవడంతో ఆటో ఖర్చులు భరించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.

వర్కర్‌ను నియమించాల్సి వస్తోంది

బుషణవేన సుమతి, రేషన్ డీలర్



మూడు నెలల రేషన్ బియ్యం ఇవ్వాలంటే దుకాణంలో వర్కర్‌ను నియమించుకోవాల్సి వస్తోంది. రోజంతా పోసిన కోటా అయిపోతుంది. కాని లబ్ధిదారుల సంఖ్య తగ్గడం లేదు. నెలంతా అందిస్తామని తెలిసిన దుకాణం చుట్టూ లబ్ధిదారులు తిరుగుతున్నారు. మా కోటా అయిపోయి నాలుగైదు రోజులవుతోంది.

తమ్ముడి చేతిలో.. అన్న హతం

- తాగిన మైకంలో అర్ధరాత్రి కర్రతో తలపై కొట్టి హత్య
- భూ వివాదాలే గొడవకు కారణం

పెగడపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా పెగడపల్లి మండలం అయిత్‌పల్లి గ్రామంలో గురువారం అర్ధరాత్రి తమ్ముడి చేతిలో అన్న హత్యకు గురయ్యాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. అయిత్‌పల్లి గ్రామానికి చెందిన కూన నర్సయ్య(50), కూన రాములు సొంత అన్నదమ్ములు. వీరికి కొంత కాలంగా భూవివాదాలు ఉండగా, పలుమార్లు గొడవలు జరిగాయి. గ్రామంలో జరిగిన పెద్దమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా ఇద్దరు అతిగామద్యం సేవించారు. ఈ నేపథ్యంలో గురువారం అర్ధరాత్రి సమయంలో పాతగొడవలను గుర్తుచేసుకుంటూ అన్నదమ్ములిద్దరు గొడవకు దిగారు. రాములు తనఅన్న నర్సయ్యను తలపై కర్రతోకొట్టగా తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మల్యాల సీఐ నీలం రవి, ట్రైనీ ఎస్.ఐ రవీందర్ కుమార్ శుక్రవారం ఉదయం ఘటనాస్థలానికి చేరుకుని విచారణ జరిపి, పంచనామా నిర్వహించి నర్సయ్య మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. మృతుడు నర్సయ్య భార్య రాజవ్వ ఫిర్యాదు మేరకు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ రవీందర్ కేసు నమోదు చేశారు.

దుబాయిలో బతికెపల్లి వాసి ఆత్మహత్య


లచ్చన్న (ఫైల్)

పెగడపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పుట్టినగడ్డపై ఉపాధిలేదని పరాయి దేశం వెళ్లి అక్కడ పనిదొరకక జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం బతికెపల్లిగ్రామానికి చెందిన పూడూరు లచ్చన్న(46) ఉన్నఊర్లో ఉపాధిలేక జీవనోపాధి కోసం గల్ఫ్ దేశమైన దుబాయి వెళ్లాడు. అక్కడ ఉపాధి లేకపోవడంతో జీవితంపై విరక్తితో శుక్రవారం ఉదయం తన క్వార్టర్లోనే ఉరివేసుకుని మృతిచెందాడు. విషయాన్ని అక్కడితోటి కార్మికులు లచ్చన్న కుటుంబసభ్యులకు ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. దీంతో కుటుంసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, మృతదేహాన్ని త్వరగా ఇంటికిచేరేలా చూడాలని బంధు వులు కోరుతున్నారు.

దుబాయ్‌లో గుండెపోటుతో యువకుడి మృతి


సిద్ధార్థ (ఫైల్)

ధర్మపురి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణానికి చెందిన కటుకం సిద్ధార్థ (19) అనే యువకుడు దుబాయ్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. జీవనోపాధి కోసం నెల రోజుల క్రితం సిద్ధార్థ దుబాయ్ వెళ్లాడు, అక్కడే తాత్కాలిక వేతనంపై ఏసీ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 10న పనిచేస్తున్న సమయంలో ఒక్కసారి కుప్పకూలిపోయాడు. వెంటనే ఆయనను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మృతుడి తండ్రి నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. తల్లి, చెల్లెతో కలిసి ఉంటున్న సమయంలో చిన్నతనంలోనే ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లి మృత్యువాత పడటం వల్ల ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి


హరీష్(ఫైల్)

తిమ్మాపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండల కేంద్రంలో ఇంటి వద్ద విద్యుత్‌వైర్లు తగిలి ఓ యువకుడు మృతి చెందాడు. ఎల్ఎండీ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన న్యాలం హరీష్(35) శుక్రవారం ఇంటి ముందు నీళ్ల సంపు నుంచి నీళ్లు తోడుతుండగా ఆ సంపునకు ఉన్న మోటారుకు ఉన్న విద్యుత్‌వైరుతో విద్యుదాఘాతమై హరీష్ అక్కడే కుప్పకులాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో డాక్టర్ పరీక్షించి హరీష్ మృతిచెందినట్లు తెలిపారు. హరీష్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.



రక్తదానం... అపోహలు



రక్తదానంపై నేటికీ అనేక అపోహలు ఉన్నాయి. రక్తదానం చేస్తే బలహీన పడి, నీరసించి పోతారని చాలా మంది నమ్ముతారు. శ్రమతో కూడిన పనులు చేసుకునేవారు రక్తదానం చేస్తే వారు ఆ పనిచేయలేక పోతారని, రక్తదానం చేసే సమయంలో విపరీతమైన నొప్పి ఉంటుందని అనుకుంటారు. వ్యాధులు సోకే అవకాశం ఉంటుందనే అపోహ ఉంది. అయితే రక్తదానం తరువాత ఎలాంటి బలహీనత ఉండదని, ఆరోగ్యంగా ఉంటారని, శ్రమతో కూడిన కష్టమైన పనులు చేసుకునేవారు ఇంతకు ముందులా పనిచేసుకోవచ్చని డాక్టర్లు పేర్కొంటున్నారు. రక్తదానం చేసే సమయంలో ఎలాంటి నొప్పి ఉండదని, రక్తదానం చేయడంవల్ల ఎలాంటి వ్యాధులు సంక్రమించవని చెపుతున్నారు. ఆరోగ్యంగా ఉన్నవారు ఎవరైనా రక్తదానం చేయవచ్చు.

రక్తదానం.. ప్రాణదానం

- ఆపదలో ఉన్నవారికి అండ
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

సుభాష్‌నగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రక్తదాత.. ప్రాణదాత అంటారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందించిన వ్యక్తి దేవుడితో సమానం. రక్తం అందక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ముఖ్యంగా ప్రమాదాలు జరిగినపుడు గాయపడిన వారికి తీవ్ర రక్తస్రావం అవుతుంది. అలాంటి వారికి అత్యవసరంగా రక్తం ఎక్కించాల్సి వస్తుంది. కానీ అది కృత్రిమంగా తయారు చేసేది కాదు. ఎవరైనా దాత ముందుకు వస్తేనే ఆ వ్యక్తి ప్రాణాలు నిలుస్తాయి. రక్తదానం ప్రజల్లో ఇప్పటికీ చాలా అపోహలు ఉండటంతో కొన్ని పరిస్థితుల్లో రక్తదాత దొరకడం కష్టంగా మారుతుంది. అపోహలతో చాలామంది రక్తదానం చేయడానికి ముందుకు రావడంలేదని డాక్టర్లు చెబుతున్నారు. 18 సంవత్సరాల వయస్సు నుంచి రక్తదానం చేయవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. రోగ నివారణ కోసం లేదా ప్రమాదాల సమయంలో బాధితుల శరీరంలో తగినంత రక్తం లేకపోతే మరొకరి నుంచి రక్తాన్ని సేకరిస్తారు. రక్తం తీసుకునే వ్యక్తిని రక్తగ్రహీత అని, ఇచ్చే వ్యక్తిని దాత అని అంటారు. ఓ గ్రూపు రక్తం కలిగినవారిరి విశ్వదాత అని, ఏబీ గ్రూపు రక్తం కలిగినవారిని విశ్వగ్రహీత అని అంటారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల ప్రజలకు రక్తం విలువను తెలియచేయాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడం వీలుకాదు. అయితే రక్తదాతలు ఎవరైనా రక్తాన్ని దానం చేసి, మరొకరి ప్రాణాలను కాపాడవచ్చని విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.

1992 నుంచి రక్తదానం చేస్తున్నా

బేతి మహేందర్‌రెడ్డి, న్యాయవాది, బీజేపీ నాయకుడు




నాది ఓ నెగిటివ్ బ్లడ్ గ్రూపు. నేను 1992 నుంచి రక్తదానం చేస్తున్నా. ఇప్పటి వరకు 66 సార్లు రక్తదానం చేశాను. అంతే కాకుండా ప్లేట్‌లెట్స్, ప్లాస్మ కూడా దానం చేశాను. అత్యవసర సమయంలో రక్తం అందక చాలా మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. అపోహలు వీడి రక్తదానం చేయడానికి ముందుకు రావాలి. ముఖ్యంగా యువత రక్తదానం పట్ల అవగాహన కలిగి ఉండాలి. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి.

54 సార్లు రక్తదానం చేశా

గాలిపల్లి కుమార్, సామాజిక కార్యకర్త



నేను ఇప్పటి వరకు 54 సార్లు రక్తదానం చేశాను. అత్యవసర సమయంలో చాలామందికి కేవలం ఒక్క ఫోన్‌కాల్ చేస్తే చాలు వారు ఎక్కడ ఉన్నా రక్తదానం చేయడానికి వెళతాను. అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి రక్తదానం చేసి వారి ప్రాణాలను కాపాడ మనే సంతృప్తికి మించింది లేదు. అయితే చాలా మందికి రక్తదానం గురించి అపోహ ఉంది. అపోహను వీడి రక్తదానానికి ముందుకు రావాలి.



హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు


జగిత్యాల క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కట్టుకున్న భార్యను స్నేహితుడి సహాయంతో హత్యచేసిన కేసులో ఇద్దరికి జీవిత ఖైదుతోపాటు ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున జరిమానా విధిస్తూ ఫస్ట్‌అడిషనల్, సెషన్స్‌జడ్జి నారాయణ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మోరపెల్లి శివారులోని చెరువులో గుర్తుతెలియని మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు గ్రామసెక్రెటరీ 2022లో జగిత్యాలరూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణజరిపి మల్యాల మండలం తాటిపెల్లి గ్రామానికిచెందిన అంజలి అనే మహిళగా గుర్తించారు. అంజలికి మానసిక ఆరోగ్యం సరిగా లేనందున భర్త కోట్ల రాజశేఖర్ భార్యను అడ్డుతొలగించేందుకు కుట్రపన్నాడు. 2022జూన్7న జగిత్యాలరూరల్ మండలం మోరపల్లి చెరువు దగ్గరికి తన భార్య అంజలిని తీసుకువచ్చిన రాజశేఖర్ తన స్నేహితుడు అడువాల సురేష్‌తోకలిసి కత్తితో గొంతుకోసి హత్యచేసి చెరువులో పడేశాడు. కేసుదర్యాప్తు చేసిన అప్పటి సీఐ కృష్ణకుమార్, ఎస్ఐఅనిల్ నిందితులు రాజశేఖర్, సురేష్‌పై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టుడ్యూటీ అధికారులు నరేష్, రాజు సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా అదనపు పబ్లిక్‌ప్రాసిక్యూటర్ మల్లేశం కేసు వాదించారు. నేరం రుజువుకావడంతో ఇద్దరు ముద్దాయిలకు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ముద్దాయిలకు శిక్ష పడడంలో కృషిచేసిన పోలీస్‌లను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారికి జరిమానా, శిక్ష

తిమ్మాపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో అనుమతులు లేకుండా అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తు పట్టుబడ్డ 13మంది వ్యక్తులకు లోక్‌అదాలత్‌లో భాగంగా మెజిస్ట్రేట్ ఎక్సైజ్‌కోర్టు జరిమానాతోపాటు శిక్షను కూడా ఖరారు చేస్తు శుక్రవారం ఉత్తర్వులు జారీచేసినట్లు ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఇందులో ఎలుక శ్రీధర్, ఎలుక సుమన్, గోనేల వంశీ, దుంబాల చందు, దుంబాల వెంకటేష్, బూడిద విజయ్, బొంగాని రమేష్, బోయిని సతీష్, మార్క శ్రీకాంత్, కనపర్తి చంద్రశేఖర్, కుంబాల శ్రీకాంత్, ఇనుకొండ సుధాకర్ రెడ్డి, బోనగిరి మధు మొత్తం 13మంది ఉన్నాట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో భాగంగా మెజిస్ట్రేట్ ఎక్సైజ్ కోర్టు పట్టుబడిన 13మంది వ్యక్తులకు ఒకొక్కరికి 8వేల రూపాయల జరిమానాతో పాటు వారివారి గ్రామ ప్రభుత్వపాఠశాలల్లో స్వచ్ఛభారత్ చేయాలని శిక్షను కూడా ఖరారు చేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

చిగురుమామిడి: మండలంలో అక్రమంగా ఇసుక రవాణా చేసిన ఏడుగురు వ్యక్తులకు రూ.8వేల చొప్పున జరిమానాతో పాటు మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో స్వచ్ఛభారత్ నిర్వహించాలని ఆదేశించినట్లు స్థానిక ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఒక్కొక్కరితో రెండు మొక్కలు నాటించాలని కూడా ఆదేశించినట్లు తెలిపారు.

మరదలు అంత్యక్రియలకు వచ్చి.. కుప్పకూలిన బావ


పసుల కిషన్(ఫైల్)


నర్సవ్వ(ఫైల్)

వేములవాడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మరదలు అంత్యక్రియలకు వచ్చిన బావ కుప్పకూలి మృతిచెందిన సంఘటన వేములవాడ పట్టణంలో చోటుచేసుకుంది. గురువారం సాయినగర్‌లోని బోనాల వీధికి చెందిన కోల రామ్మూర్తి సోదరి నర్సవ్వ(56) అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న కరీంనగర్‌కు చెందిన మృతురాలి బావ(అక్క భర్త) పసుల కిషన్(73) వేములవాడ చేరుకున్నాడు. అంత్యక్రియలు పూర్తయిన తర్వాత ఇంటికి చేరుకున్న తరుణంలో బంధువులందరూ రోదిస్తుండగా ఓదార్చిన కిషన్ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. హుటాహుటిన బంధువులు స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా గుండెపోటుతో మృతిచెందాడని వైద్యులు పేర్కొన్నారని బంధువులు తెలిపారు. శుక్రవారం కిషన్ అంతిమ సంస్కారాలు కరీంనగర్‌లో నిర్వహించిన్నట్లు బంధువులు తెలిపారు. నర్సవ్వ అక్క సరోజన ఆరేళ్ల క్రితం మృతిచెందింది.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్‌క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం వెంకటయ్యపల్లిలో చోరీకేసులో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వారివద్ద నుంచి 33 తులాల బంగారు ఆభరణాలు, వెండి, 25వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోలీస్ కమిషనర్ గౌస్‌ఆలం వివరాలు వెల్లడించారు. వెంకటాయపల్లికి చెందిన ఉప్పుగండ్ల గంగారెడ్డి ఈ నెల8న తనఇంటికి తాళంవేసి తాగునీటిని తీసుకొచ్చేందుకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని బంగారం, నగదు, వెండి చోరీ చేసినట్లు గుర్తించాడు. ఈ ఘటనపై బాధితుడు గంగాధర పోలీసులకు ఫిర్యాదుచేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు సాంకేతికపరిజ్ఞానం ఉపయోగించి నిందితులను గుర్తించారు. మొత్తం ఐదుగురిపై కేసు నమోదు చేశారు. ముగ్గురు ప్రత్యక్షంగా దొంగతనానికి పాల్పడగా ఇద్దరు దొంగిలించిన సొత్తులో కొంత బంగారాన్ని తక్కువ ధరకు కొన్నట్లుగా గుర్తించి వారిపై కూడా కేసు నమోదు చేశారు. ఐదుగురు నిందితుల్లో శుక్రవారం రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేటకు చెందిన గాజుల హేమంత్, కొమ్ము నవీన్‌ను పట్టుకున్నట్లు, ముగ్గురు పరారీలో ఉన్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా సీపీ రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్‌తోపాటు చొప్పదండి సీఐ ప్రదీప్ కుమార్, క్లూస్ టీం ఎస్సై రాజు, గంగాధర ఎస్సై వంశీకృష్ణ, సీసీఎస్ ఎస్సై నాగరాజును, కానిస్టేబుళ్లను అభినందించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్/గణేష్‌నగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడికరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లిజిల్లాలో డిగ్రీపాసైన అభ్యర్థులకు సివిల్‌సర్వీసెస్ ఉచిత శిక్షణకు బీసీ స్టడీసర్కిల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కరీంనగర్ జిల్లా బీసీస్టడీసర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ ఒకప్రకటనలో తెలిపారు.ఈనెల16నుంచి జూలై8లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఆన్‌లైన్ పరీక్షద్వారా ఎంపికచేస్తామన్నారు. తరగతులు జూలై 25నుంచి 30ఏప్రిల్ 2026వరకు టీజీబీసీ స్టడీ సర్కిల్, లక్ష్మీనగర్‌కాలనీ, సైదాబాద్, హైదరాబాద్‌లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. 150మందికి శిక్షణఇస్తారని, వందమందిని జూలై12ననిర్వహించే ఆన్‌లైన్ స్క్రీనింగ్‌టెస్ట్ ద్వారా ఎంపికచేస్తారని, మరో50 మందిని గతంలో సివిల్‌సర్వీసెస్(ప్రిలిమ్స్) పరీక్షలో ఉత్తీర్ణులైన వారిని ఎంపిక చేస్తారన్నారు. సంబంధిత పత్రాలతో టీజీబీసీ స్టడీ సర్కిల్,రోడ్‌నంబర్8, లక్ష్మీనగర్‌కాలనీ, సైదాబాద్, హైదరాబాద్‌లో అప్లైచేసుకోవా లన్నారు. అభ్యర్థులకులాడ్జింగ్,బోర్డింగ్, రవాణా కోసం నెలకురూ.5000స్టైఫండ్, రూ.5000 బుక్‌ఫండ్ ఒకసారి మాత్రమే ఇస్తారన్నారు. వివరాలకు 040-24071178నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

గుప్తనిధుల పేరిట నమ్మించి మోసం

- ఐదుగురు ముఠా సభ్యుల అరెస్టు
- నిందితుల వద్ద నుంచి 15.30 లక్షల నగదు, 3 కార్లు, 7 సెల్‌ఫోన్‌ల స్వాధీనం


నిందితులను అరెస్టు చూపుతున్న కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభంప్రకాశ్


కరీంనగర్ క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న నకిలీ బాబాలు ప్రత్యేక పూజలు చేసి గుప్తనిధులను బయటకు తీస్తేనే తల్లిదండ్రుల ఆరోగ్యం కుదురుకుంటుందని కొడుకును నమ్మించి 15.30 లక్షలరూపాయలు తీసుకుని మోసంచేసిన ఐదుగురు నకిలీ స్వాముల ముఠాను కొత్తపల్లి పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ మేరకు కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్, సీఐ నిరంజన్‌రెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు.

కరీంనగర్ జిల్లా కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన గజ్జి ప్రవీణ్ (25) తండ్రి కనకయ్య, వేములవాడ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఒకప్రమాదంలో ఎడమ కాలు విరిగింది. అతని తల్లి కూడా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని, పదిరోజుల క్రితం స్వామివేషంలో ఉన్న ఒకవ్యక్తి గజ్జి ప్రవీణ్‌కు పరిచయమయ్యాడు. అతను ప్రవీణ్‌ఇంట్లో ఏమీ బాగాలేదని, ఇంటి పక్కనే క్వింటాల్ వరకు బంగారు కడ్డీ ఉందని, దానిని బయటకు తీసి పూజలు చేస్తే కుటుంబ సభ్యుల ఆరోగ్యం మెరుగుపడుతుందని, లేకపోతే మీ తండ్రి నెల రోజులలోపు చనిపోతాడని నమ్మించారు. అందుకు పూజలు చేయాలని, కావాల్సిన పూజా సామగ్రి కొనుగోలు చేయాలని మాయమాటలు చెప్పి విడతలవారీగా రూ. 15లక్షల 30 వేలు ప్రవీణ్ వద్ద వసూలు చేశాడు. డబ్బులు తీసుకున్న తర్వాత ఐదుగురు ముఠాసభ్యులు కొంత పూజా సామగ్రి కొనుగోలు చేసి, ఇంటి పక్కనే ఒకగొయ్యి తవ్వి, కుంకుమ, పసుపు చల్లి, అందులో నుంచి ఒక డబ్బా తీశారు. దానిలో కిలో బంగారం ఉంటుందని చెప్పి ప్రవీణ్ ఇంటిలోని దేవుడి గదిలో పెట్టించారు. ఇంకా డబ్బులు కావాలని బెదిరింపులకు పాల్పడ్డారు. లేకపోతే మీ నాన్నను ఇక్కడే చంపి పాతిపెడతాం అని బెదిరించారు. భయపడిన ప్రవీణ్, చుట్టుపక్కల వారి వద్ద నుంచి మరికొంత డబ్బు తీసుకొని వారికి ఇచ్చారు. ఈ విషయంపై గజ్జి ప్రవీణ్ కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టగా కరీంనగర్‌లోని చింతకుంట వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. చంద్రగిరి గ్రామానికి చెందిన ఈర్నాల రాజు, అగ్రహారం గ్రామానికి చెందిన మిరియాల దుర్గయ్య, చీర్లవంచ గ్రామానికి చెందిన పెనుగొండ రాజు, చల్లా అజయ్, ఈర్నాల సతీష్‌లని విచారణలో గుర్తించారు. వారు తాము చేసిన తప్పును ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి 15 లక్షల 30 వేల నగదు, 7 తులాల బంగారం, మూడు కార్లు, ఏడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ కేసును ఛేదించిన కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి, కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి, కరీంనగర్ రూరల్ ఎస్సై లక్ష్మారెడ్డిలను కరీంనగర్ కమిషనర్ గౌస్ ఆలం అభినందించారు. ఈ సందర్భంగా కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్ మాట్లాడుతూ పూజలు చేస్తాం అంటూ వేషాలు వేసుకుని తిరిగే నకిలీ స్వాముల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మూఢ నమ్మకాలను విడనాడాలని సూచించారు. ఇటువంటి స్వామి వేషంలో మోసపోయిన ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రైలు కింద పడి మహిళ మృతి

అంతర్గాం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పెద్దంపేట రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తు రైలు కింద పడి కొలిపాక రాజమణి(54)అనే మహిళ శుక్రవారం మృతి చెందింది. రామగుండం జీఆర్‌పీ ఇన్‌చార్జి తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం పెద్దంపేట గ్రామానికి చెందిన కొలిపాక రాజమణి గ్రామ శివారులోని చేన్లకు వ్యవసాయ పనులకు వెళ్ళింది. పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న క్రమంలో రైల్వే ప్లాట్ ఫాంపై ఆగి ఉన్న గూడ్స్ రైలుకింద నుంచి దాటడానికి ప్రయత్నించింది. ఈ క్రమంలో రైలు కదలడంతో రైలు కింద పడి మృతి చెందింది. సంఘటన స్థలాన్ని సందర్శించిన జీఆర్‌పీ పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే జీఆర్‌పీ పోలీసులు పేర్కొన్నారు. మృతురాలికి ముగ్గురు కూతుళ్లు, భర్త ఉన్నారు.

చెరువులో పడి పశువుల కాపరి మృతి


కొంరయ్య

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అల్లూరు చెరువులో ప్రమాదవశాత్తు అవుల కొంరయ్య(50) అనేపశువుల కాపరి పడి శుక్రవారం మృతిచెందాడు. అల్లూరు శివారు గంగిరెద్దులవాడలో నివసిస్తున్న కొంరయ్య పశువులను పెంచుతుంటాడు. గ్రామ శివారుతోపాటు చెరువు పరిసరాల్లో పశువులను మేపుతుంటాడు. శుక్రవారం చెరువులో దిగిన పశువులను బయటకు తీసుకువచ్చేందుకు కొంరయ్య చెరువులోకి దిగాడు. ప్రమాద వశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

గంభీరావుపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం దమ్మన్నపేటకు చెందిన ఈరవేని భూమలింగం(50) జగదాంబ తండా సమీపాన శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. భూమలింగం గురువారం సాయంత్రం 4గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో వారి బంధువులు భూమలింగం కోసం చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించారు. మరుసటి రోజు జగదాంబతండా సమీపాన భూమలింగం శవమై కనిపించాడు. అటుగావెళ్లే వారు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతోవారి కుటుంబసభ్యులు సంఘటన స్థలం వద్దకు వచ్చి రోదించారు. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ ప్రేమానందం సిబ్బందితో వచ్చి సంఘటనస్థలాన్ని పరిశీలించారు. భూమలింగం ఇటీవల మద్యానికి బానిసైనట్టు, మద్యం మత్తులో కిందపడి మృతిచెంది ఉండవచ్చని బంధువులు ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా భూమలింగంను ఎవరో కొట్టడం వల్లే మృతిచెందాడని, ఒంటిపై గాయాలున్నాయని బంధువులు విలేకరులకు తెలిపారు. ఈవిషయమై ఎస్ఐ ప్రేమానందంను అడగా, అనుమానాస్పద మృతిగాభావిస్తూ భూమలింగం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

సీఎంను కలిసిన మంత్రి అడ్లూరి, ఎమ్మెల్యేలు


హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని సహచర మంత్రులు, సామాజిక వర్గం ఎమ్మెల్యేలతో కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

తిమ్మాపూర్/ధర్మపురి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గంలో కొత్తగాచేరిన మంత్రులు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని తననివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రివర్గంలో మాదిగ సామాజికవర్గానికి ప్రాధాన్యం కల్పించిన నేపథ్యంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అదే సామాజి కవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ (మానకొండూర్), మందుల సామెల్(తుంగతుర్తి), తోట లక్ష్మీకాంత రావు (జుక్కల్), కాలె యాదయ్య(చేవెళ్ల)తోపాటు పలువురు నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి పూలబొకే ఇచ్చి, శాలువకప్పి కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రివర్గంలో కొత్తగా చేరిన మంత్రి వాకిటి శ్రీహరి, మరో సీనియర్ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో నాలుగు రోజుల జైలు శిక్ష

జగిత్యాల క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలో పట్టణ పోలీసులు గురువారం వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతూ బోరగాళ్ల శేఖర్ అనే వ్యక్తి పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం జగిత్యాల కోర్టులో హాజరు పరిచారు. సెకండ్ అడిషనల్ స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ కేసు విచారించి నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు కోర్టు హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ రావు తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

కొడిమ్యాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడూర్ గ్రామానికి చెందిన వొల్లాల తిరుపతిగౌడ్ తాటిచెట్టు పైనుంచిపడగా తీవ్రగాయాలపాలైనట్లు గ్రామస్థులు గురవారంతెలిపారు. చేతులు, భుజానికి, కాలుకు గాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. తాటి చెట్టు పైనుంచి పడి గాయాలపాలైన బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాల ని గౌడ సంఘం అధ్యక్షుడు చల్లూరి వెంకటేష్‌గౌడ్, సభ్యులు కోరారు.

రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి బదిలీ..

● ఇన్‌చార్జి ఈవోగా ఆర్డీవో రాధాబాయి



రాధాబాయి

వేములవాడ కల్చరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయఈవోగా విధులు నిర్వర్తిస్తున్న వినోద్‌రెడ్డిని బదిలీ చేస్తూ దేవాదాయశాఖ ఉత్తర్వులు శుక్రవారం విడుదల చేసింది. వినోద్‌రెడ్డిని దేవాదాయ శాఖ మల్టీజోనల్-2 డిప్యూటీకమిషనర్‌గా నియమించారు. వేములవాడ ఆర్డీవోగా విధులు నిర్వర్తిస్తున్న రాధాబాయిని ఆలయ ఇన్‌చార్జి ఈవోగా నియమిస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు.

రాజన్నను దర్శించుకున్న ఇన్‌చార్జి ఈవో..

రాజన్న ఆలయ ఇన్‌చార్జి ఈవోగా నియమించడంతో రాధాబాయి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వర స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఏఈవో ప్రసాదాన్ని అందజేశారు. కాగా దేవాదాయ శాఖ మల్టీజోన్-2 డీసీగా బదిలీపై వెళుతున్న వినోద్‌రెడ్డి కుటుంబ సభ్యుతో కలిసి రాజన్నను దర్శించుకున్నారు. అర్చకులు ఆశీర్వచనం ఇచ్చి స్వామివారి శేషవస్త్రంతో సన్మానించారు.

తప్పని దుమ్ము తిప్పలు

● నిత్యం వందలాది లారీలు

● ప్రజల ఇబ్బందులు



సుల్తానాబాద్‌లో దుమ్మురేపుతున్న మట్టి లారీలు

సుల్తానాబాద్, జూన్ 13 : (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణ ప్రజలకు మళ్లీ దుమ్ము తిప్పలు మొదలయ్యాయి. రెండేళ్ల నుంచి ఈ సమస్యతో ప్రజలు, ముఖ్యంగా ఈ రోడ్డును ఆనుకుని ఉన్న దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డు నిర్మాణం పనుల ప్రారంభంతో కొన్ని నెలల పాటు ఉపశమనం లభించింది. ఇటీవల ఈ రోడ్డు నుంచి పెద్ద ఎత్తున భారీ టిప్పర్లు లారీలు రాకపోకలు సాగిస్తూ దుమ్ము రేపుతున్నాయి. ముఖ్యంగా మట్టి లారీలు వందల సంఖ్యలో వెలుతున్నాయని, దానికి తోడు ఇసుక లారీలు, గ్రానైట్ లారీలు, బియ్యం, ధాన్యం లారీలు, ఇసుక ట్రాక్టర్లు పెద్ద ఎత్తున నడుస్తుండటంతో వాటి వలన వెదజల్లుతున్న ధుమ్ము కారణంగా ఆనారోగ్యం పాలవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సుల్తానాబాద్ ఐబీ చౌరస్తా నుంచి కోర్టు, తహసీల్దార్, మండల పరిషత్, ప్రభుత్వ అసుపత్రి తదితర ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలు, హస్టల్స్ ఈ రోడ్డును ఆనుకునే ఉన్నాయి. ఆసెంబ్లీ ఎన్నికలు జరుగకముందు నుంచి ఈ రోడ్డు పై వాహనాల రాకపోకలతో దుమ్ము సమస్య ఏర్పడి పాదచారులు నడిచి వెళ్లలేని దుస్థితి నెలకొనేది. మళ్లీ గత కొన్ని రోజుల నుంచి అదే దుస్థితి ఏర్పడింది. సుల్తానాబాద్ మీదుగా వందలాది మట్టి లారీలు వెలుతుండడంతో విపరీతమైన దుమ్ము ప్రజలను దుకాణాలను కమ్మేస్తుంది. ముఖ్యంగా అతి భారీ వాహనాలు పద్నాలుగు టైర్ల లారీలు ఎక్కువగా వెలుతుండడంతో చట్టు పక్కల వైబ్రేషన్ కూడా ఏర్పడతుందని బాదితులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఈ మట్టి లారీలు ఉదయం నుంచి సాయంత్రం వరకు రైలుబోగీల్లా, చీమలదండులా వరుసగా ఒకదానిని అనుకుని ఒకటి వెలుతుండడంతో ప్రజలు రోడ్డు దాటడానికి కూడా భయపడిపోతున్నారు. అధికారులు వెంటనే ఈ భారీ వాహనాల రాకపోకల మూలంగా దుమ్ము రేగకుండా రోడ్డు నిర్మాణ పనులు తొందరగా పూర్తి చేయించాలని కోరుతున్నారు.

చెరువుకట్టపై ముళ్ల పొదలు

● ఇబ్బందులు పడుతున్నరైతులు

కాల్వశ్రీరాంపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నీలకంఠ చెరువుకట్టపై తుమ్మలు పెరిగి దానిపై వెళ్లేందుకు రైతులు ఇబ్బం దులు పడుతున్నారు. చెరువుకట్ట హుస్సేన్‌మియావాగు దారి నుంచి పోలీస్ స్టేషన్ దారి వరకు సుమారు కిలోమీటర్ వరకు ఉంటుం ది. 90ఎకరాల విస్తీర్ణం ఉన్న నీలకంఠ చెరువుకట్టు కింద ఆయకట్టు సుమారు 200ఎకరాల వరకు ఉంటుంది. ప్రతిరోజు ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా రైతులు వ్యవసాయ పనులకు కట్టపై నుంచి వెళ్తుంటారు. పొలాల్లో ఎరువు వేయడానికి కట్టపై ముల్లపొదలు ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చెరువు కట్టపై రెండువైపులా తుమ్మ పొదలు అధికంగా ఉండడంతో ఇబ్బందులు పడుతూ వెళ్తున్నారు. గత ప్రభుత్వంలో చెరువుకట్టని వెడల్పు చేసి కట్టపైన సీసీ రోడ్డు వేయడంతో పాటు మినీ ట్యాంక్ బండ్ నిర్మిస్తామని చెప్పినా కార్యరూపం దాల్చలేదు. తుమ్మలు తొలగించి కట్టను వెడల్పు చేయాలని రైతులు కోరుతున్నారు.



కట్టపై దారికి అడ్డంగా పెరిగిన తుమ్మలు

మీ క్యూట్ చిల్డ్రన్

● కలెక్టర్ స్టేటస్‌లో గర్షకుర్తి, వెంకటయ్యపల్లి విద్యార్థుల ఫొటోలు



కలెక్టర్ స్టేటస్‌లోని వెంకటయ్యపల్లి విద్యార్థుల ఫొటో

గంగాధర, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మీ క్యూట్ చిల్డ్రన్ అంటూ కలెక్టర్ పమేలాసత్పతి గంగాధరమండలం గర్షకుర్తి, వెంకటయ్యపల్లి ఎంపీయూపీఎస్ విద్యార్థులఫోటోలు తనస్టేటస్‌లో పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వెంకటయ్యపల్లి, గర్షకుర్తి పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈసందర్భంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రూప్‌లో జిల్లాలోని వివిధశాఖ అధికారులతో పాటు కలెక్టర్, అదనపుకలెక్టర్లు సభ్యులుగా ఉన్నారు. అయితేజిల్లాలో ఎంఈవోలు విద్యాశాఖ ఆధ్వర్యంలో మండలాల్లో చేపట్టిన కార్యక్రమాల వివరాలతోపాటు ఫొటోలను అప్‌లోడ్‌చేస్తారు. శుక్రవారం మండలంలోని రెండు పాఠశాలల్లో చేపట్టిన కార్యక్రమాలతోపాటు ఫొటోలను ఎంఈవో ప్రభాకర్‌రావు జిలా గ్రూప్‌నకు పంపించారు. ఈ సందర్భంగా వాటిని గమనించిన కలెక్టర్ గర్షకుర్తి, వెంకటయ్యపల్లిలోని చిన్నారుల ఫొటోలను తనస్టేటస్‌గా పెట్టుకున్నారు. అందులో మైక్యూట్ చిల్డ్రన్ అని సంబోధించిన వ్యాఖ్యాలు మండలంలోని ఉపాధ్యాయులకు ఉత్సాహాన్ని నింపాయి. తాము విద్యార్థులకు చేస్తున్న బోధనలకు కలెక్టర్ మేడం స్టేటస్ రూపంలో ప్రోత్సాహం చూపడంతో ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. దీంతో మరింత బాధ్యతగా విద్యార్థుల భవిష్యత్తుకు బాటలువేస్తూ సర్కారుబడి నాణ్యమైన విద్యపై తల్లిదండ్రులకు వివరించి విద్యార్థుల సంఖ్యను పెంచుతామని అన్నారు.

ఎస్సారెస్పీకి స్వల్పంగా పెరిగిన వరద

● ప్రాజెక్టులోకి 3,314 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరుగుతోంది. శుక్రవారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ఎస్సారెస్పీలోకి 3,314 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 సామర్థ్యంకు గానూ ప్రస్తుతం 13.601 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

కోడెల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యమివ్వాలి

● కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



రైతుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడ కల్చరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాజన్న ఆలయ గోశాలలోని కోడెల సంరక్షణకు అత్యంత ప్రాధానత్యను ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా అన్నారు. తిప్పాపూర్ గోశాలలో శుక్రవారం 100 కోడెలను అర్హులైన రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసుకున్న రైతుల ధ్రువపత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు 375జతల కోడెలు(750 కోడెలు) రైతులకు పంపిణీ చేశామన్నారు. గోశాలనుంచి పంపిణీ చేసిన కోడెలను వ్యవసాయ అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని సూచించారు. కోడెలు పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రాజన్న కోడెలపై ప్రత్యేక శ్రద్ధపెట్టి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి ఉన్నారు.

హక్కుల కోసం యాదవులు ఉద్యమించాలి

● యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్



నియామకపత్రం అందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌యాదవ్

సిరిసిల్ల టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : యాదవులు అన్ని రంగాల్లో హక్కుల కోసం ఉద్యమించాలని యాదవవిద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని ఓ ప్రైవేటుపాఠశాలలో యాదవ విద్యావంతుల వేదిక జిల్లా కార్యవర్గం సమావేశంలో జిల్లా నూతనకార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్ మాట్లాడారు. ప్రస్తుతం యాదవులు అన్ని రంగాల్లో వివక్షతను ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యా, ఉద్యోగరంగాలతో పాటు సామాజిక, ఆర్థికి, రాజకీయ రంగాలలో జనాభానిష్పత్తి ప్రకారం వాటాల కోసం రాజకీయ సామాజిక చైతన్యం కోసం ముందుకు సాగాలన్నారు. యాదవజాతి రాజకీయ రంగంలోకూడా వాటా సాధించాలంటే ఐకమత్యం అనే చైతన్యం ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని అన్నారు. సంఘం భవిష్యత్తు కార్యక్రమాలకోసం జిల్లా నూతనకార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. జిల్లాఅధ్యక్షుడు బొబ్బల మల్లేష్‌యాదవ్, ప్రధానకార్యదర్శి బత్తుల మహేందర్‌యాదవ్, న్యాయవిభాగం అధ్యక్షురాలు యమునాయాదవ్, రాష్ట్ర కార్యదర్శి జగ్గాని మల్లేష్‌యాదవ్, జిల్లా గౌరవ సలహాదారులుగా శ్రీనివాస్‌యాదవ్, తోట్ల రాములుయాదవ్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. నూతన కార్యవర్గం సభ్యులకు నియామక పత్రాలను రాష్ట్రఅధ్యక్షుడు వెంకట్‌యాదవ్ అందించి అభినందించారు. కార్యక్రమంలో గొర్రెలకాపరుల సంక్షేమసంఘం రాష్ట్రఅధ్యక్షుడు పోచబోయిన శ్రీహరియాదవ్, రాష్ట్ర కార్యదర్శి వీరవేణి మల్లేష్‌యాదవ్, యాదవ కుల సంఘం నాయకులు యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ.. ఒకరి మృతి

శంకరపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్‌శివారులో శుక్రవారం రెండుద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన చింతిరెడ్డి లింగారెడ్డి (58) వ్యక్తిగత అవసరాల రీత్యా కేశవపట్నంకువెళ్లి తిరిగి ఇంటికివస్తున్నాడు. ఈక్రమంలో మొలంగూర్‌కు చేరుకోగానే ఆగ్రామానికి చెందిన కనకంతిరుపతి తన ద్విచక్రవాహనంపై వేగంగావస్తూ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో చింతిరెడ్డి లింగారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108సిబ్బంది క్షతగాత్రుడిని కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడు విద్యాసాగర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

పేదలకు అండగా ఉంటాం..

● ఈ ఐదేళ్లలో రాష్ట్రంలో 20 లక్షల ఇళ్లు ఇస్తాం.. ● జిల్లాకు బఫర్ కింద మరో వెయ్యి ఇందిరమ్మ ఇళ్లు

● అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి నిధులు

● రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలు ఇస్తున్న మంత్రులు

పెద్దపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేటప్పుడు, ఏ కులం, ఏ మతం అని చూడలేదు.. పేదోడైతే చాలనుకున్నాం.. ఈ ఐదేళ్లలో ఇరవై లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి తీరతామని, చివరకు పింకు షర్టు తొడుక్కున్న వాళ్లకు కూడా ఇళ్లు ఇస్తామని, తలతాకట్టు పెట్టయినా పేదలకు ఇందిరమ్మ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్‌శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ఎలిగేడు, పెద్దపల్లి రూరల్, మహిళా, ట్రాఫిక్ నూతన పోలీస్ స్టేషన్ల ఆరంభం, పెద్దపల్లి పట్టణంలో రూ.4.25 కోట్లతో నిర్మించనున్న సమీకృత కూరగాయల మార్కెట్‌కు శంకుస్థాపనచేసి చందపల్లి, రాంపెల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూముల ఇళ్లను ప్రారంభించారు. అనంతరం చందపల్లిలో జరిగిన బహిరంగసభలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద వాడికి అండగా ఉంటూ ఇందిరమ్మ పాలనను చూసి ఓర్వలేని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కళ్లుండి కబోదిలా మారారని, సన్నబియ్యంలో పురుగులు వస్తున్నాయని విమర్శిస్తున్నారని, ఇక్కడ ఓ చెల్లెమ్మను సన్నబియ్యంలో పురుగులున్నాయని అంటున్నారని అడిగేతే.. వాళ్ల నోట్లో పురుగులు పడ.. బియ్యంలో ఎక్కడ పురుగులున్నాయని చెప్పారని ఎదురు ప్రశ్నించిందని అన్నారు. అందరితో సమానంగా పేదల కడుపు నింపామని అంటూ ఆ మహిళ సమాధానంతో నా కళ్లల్లో నీళ్లు తిరిగాయని అన్నారు. కల్లబొల్లి మాటలు చెప్పి, ప్రజలను మోసం చేసి పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ పార్టీ ప్రజలకు వెలగబెట్టిందేమి లేదని, 8లక్షల19కోట్లరూపాయల అప్పులు చేశారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేదలకు అండగా ఉండేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 4.50లక్షల ఇందిరమ్మ ఇళ్లను చేపట్టాలని, ఇందుకు 22,500 కోట్లనిధులు ప్రభుత్వం కేటాయించిందన్నారు. రాష్ట్రంలో 20లక్షల ఇళ్లు మంజూరు చేసి తీరతామని అన్నారు. నాటి ప్రభుత్వం అర్ధంతరంగా వదిలేసిన డబుల్ బెడ్‌రూముల ఇళ్లను పూర్తిచేసి ఇస్తున్నామన్నారు. దేశచరిత్రలోనే సన్నబియ్యం అందిస్తున్న చరిత్ర ఏ రాష్ట్రానికి లేదన్నారు. సన్నవడ్లకు 500 బోనస్ ఇస్తున్నామని, 21కోట్ల రూపాయల వరకు రైతులకు ఏకకాలంలో 2లక్షల రూపాయల వరకు రుణ మాఫీ చేశామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ధరణి వల్ల తమ భూములపై భరోసా లేకుండా చేసింది. దానిస్థానంలో భూభారతిచట్టాన్ని తీసుక వచ్చామని, రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 70శాతంవరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరిగాయని మంత్రి అన్నారు.

● సన్నబియ్యంతో కుటుంబానికి నెలకు రూ. 2 వేల వరకు ఆదా

ఎన్నికల సందర్భంగా సన్నబియ్యం ఇస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని రాష్ట్రఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ప్రతి నెలా ఒక్కో కుటుంబానికి సన్నబియ్యంతో 2వేల రూపాయల వరకు ఆదా అవుతున్నాయన్నారు. ఆయకట్టు చివరి ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఇందిరమ్మ కమిటీ ఏర్పాటు చేసి పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామన్నారు. అర్హత ఉండి ఇండ్లు రాని వారు ఆందోళన చెందవద్దని, రాబోయే దశలలో మరిన్ని ఇండ్లు మంజూరు అవుతాయని అన్నారు. గత ప్రభుత్వం మధ్యలో వదిలిపెట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కూడా 6కోట్ల రూపాయలతో తాగు నీరు, సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతులు పూర్తిచేస్తామన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తున్నదని అన్నారు.

కలెక్టర్ కోయశ్రీహర్ష, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్, డీసీపీ కరుణాకర్, అదనపు కలెక్టర్లు డి వేణు, జే అరుణశ్రీ, పెద్దపల్లి ఆర్డీఓ బి గంగయ్య, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, పెద్దపల్లి, సుల్తానాబాద్ మార్కెట్ కమిటీల చైర్మన్లు ఈర్ల స్వరూప, మినుపాల ప్రకాశ్ రావు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

సమాజాన్ని కాపాడేది కమ్యూనిస్టులే

● ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి ●సీపీఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న సీపీఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివరావు

జగిత్యాల అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని కాపాడేది సైనికులైతే సమాజాన్ని కాపాడేది కమ్యూనిస్టులేనని.. దేశంలో ఎర్రజెండా లేకుండా చేయడం ప్రధాని మోదీ కాదని సీపీఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో సీపీఐ జిల్లా నాలుగో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు హాజరై మాట్లాడారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉందని దేశం అంతర్గత ప్రమాదంలో పడిందన్నారు. కమ్యూనిస్టులు బలపడితే దేశం బలపడుతుందన్నారు. ప్రజల కష్టానికి ప్రతిఫలం లభించడంలేదని, దేశసంపద కొందరి చేతుల్లోనే ఉందని, అంబాని, ఆదాని టాటా, బిర్లావంటి పెట్టుబడిదారుల గత్తాదిపత్యంలో ఉందని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ దళారుల కొమ్ము కాస్తున్నారన్నారు. 11సంవత్సరాల పాలనలో దేశంలో పేదరికం పోయిందని కేవలం ఐదు శాతం మాత్రమే పేదలు ఉన్నారని ప్రపంచ బ్యాంక్ అంచనా వేయడం చూస్తుంటే ఇవి బూర్జువా పార్టీలకు కొమ్ముకాస్తున్నాయనే విషయం స్పష్టం అవుతుందన్నారు. పేదలకోసం జైలుకు వెళ్లినచరిత్ర సీపీఐకి ఉందన్నారు. స్వరాజ్యం సిద్ధించి 78ఏళ్ళు అయినా ఇంక రేషన్ కార్డులు ఎందుకని ఆయన ప్రశ్నించారు. మావోయిస్టులను చంపవద్దని ఆపరేషన్ కాగార్‌ను వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో అన్నాదమ్ముల్లాగా కలిసి ఉంటున్న ప్రజలను మతం పేరుతో చిచ్చుపెట్టి బీజేపీ పబ్బం గడుపుకుంటోందని విమర్శించారు. దేశాన్ని కాపాడేది సైనికులైతే సమాజాన్ని కాపాడేది కమ్యూనిస్టులేనని అన్నారు.

మావోయిస్టులతో చర్చలు జరపాలి..

చిగురుమామిడి: కేంద్రప్రభుత్వం మావోయిస్టులపై నిర్వహిస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరపాలని సీపీఐ రాష్ట్రకార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని రేకొండలో విలేకరులతో మాట్లాడుతూ మావోయిస్టులను కాల్చి చంపడం అప్రజాస్వామిక చర్య అని అన్నారు. కాళేశ్వర విచారణలో అధికారులను బలి చేసే కుట్ర జరుగుతోందన్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి ప్రాజెక్టులో జరిగిన అన్ని విషయాలను రాష్ట్ర ప్రజలకు తెలియపరచాలని అన్నారు. 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సీపీఐ పార్టీ ఉత్సవాలను డిసెంబరు వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్నిగ్రామాల్లో ఉత్సవాలు జరుపుతామని అన్నారు. ఉత్సవాల ముగింపు బహిరంగా సభ కొత్తగూడెంలో 5లక్షలతో మందితో నిర్వహిస్తామని అన్నారు. కమ్యూనిస్టు పార్టీకి కంచుకోటగా ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని మండలాల్లో విజయం సాధించాలని అన్నారు.

పరామర్శ..

చిగురుమామిడిమండలంలోని రేకొండలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు చాడ శోభ కుటుంబ సభ్యులను కూనంనేని సాంబశివరావు పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు.

దోపిడీ ఉన్నంతకాలం.. ఎర్రజెండా ఉంటది..

జగిత్యాల (ఆంధ్రజ్యోతి): దోపిడీ ఉన్నంత కాలం ఎర్రజెండా ఉంటుందని సీపీఐ జాతీయకార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లాకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సీపీఐ 4వ మహాసభకు ఆయన హాజరై, ప్రజాప్రదర్శన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ అంతరాలులేని సమాజం కోసమే ఎర్రజెండా పుట్టిందన్నారు. దేశంలో మతోన్మాదం పెరిగిపోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కగార్ పేరుతో మావోయిస్టులను కాల్చిచంపుతున్నారని, ఈ దుశ్చర్యను తక్షణమే ఆపాలన్నారు. ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వెన్న సురేష్, నాయకులు వెన్న మహేష్, కొక్కుల శాంత, జిల్లాలోని వివిధ అనుబంధ సంఘాల నాయకులు, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

బెస్ట్ ఫిలిం క్రిటిక్ గద్దర్ అవార్డుకు పొన్నం రవిచంద్ర ఎంపిక

● నేడు సీఎం రేవంత్ చేతుల మీదుగా స్వీకరణ



డాక్టర్ పొన్నం రవిచంద్ర

కరీంనగర్ కల్చరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినిమా విమర్శలో తనదైన ముద్ర వేసి, సినీ రంగంపై అనేక వ్యాసా లు, పుస్తకాలురాసి, డాక్యుమెంటరీలు నిర్మించిన కరీంనగర్‌కు చెందిన డాక్టర్‌పొన్నం రవిచంద్రను రాష్ట్రప్రభుత్వం తొలిసారిగా గద్దర్‌పేరిట ఇస్తున్న అవార్డులలో భాగంగా 2024సంవత్సరానికి బెస్ట్ ఫిలిం క్రిటిక్ గద్దర్ అవార్డు వరించింది. కరీంనగర్ ఫిలిం సొసైటీ అధ్యక్షునిగా కొనసాగుతున్న ఆయన సినీ ప్రస్థానం ఎంతో విశిష్టమైంది. కరీంనగర్‌కు చెందిన బాలీవుడ్ నటుడు పైడి జయరాజ్‌ను లోకానికి పరిచయం చేయాలని ముంబై వెళ్లి జయరాజ్ బంధువులను కలుసుకొని వివరాలు, ఫొటోలు సేకరించి డాక్యుమెంటరీ నిర్మించారు. దీనికి అవార్డు కూడా వచ్చింది. అలాగే రావూరి భరద్వాజ, శతాబ్దిచిత్రం, దేశభక్తి సినిమాలు, సర్దార్ సర్వాయి పాపన్న, భూమిపుత్రుడు వంటి అంశాలపై డాక్యు మెంటరీలు నిర్మించారు. సీనియర్ జర్నలిస్టుగా, సినీ విమర్శకుడిగా, రచయితగా బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఆయన పలుపత్రికలకు వ్యాసాలు రాశారు. 80ఏళ్ల తెలుగుసినీ ప్రస్థానంపై రాసిన ప్రస్థానం పుస్తకానికి ఏపీ ప్రభుత్వం నంది అవార్డు అందజేసింది. కరీంనగర్ జిల్లాఏర్పడి వందేళ్లు అయిన సందర్భంగా శతవసంతాల కరీంనగర్ పేరుతో రచించిన పుస్తకం ఎంతో గుర్తింపు పొందింది. అవార్డు దక్కడం పట్ల మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విశ్వవిద్యాలయాల జాయింట్ సెక్రెటరీ జీవి శ్యాంప్రసాద్‌లాల్, కఫిసొ బాధ్యులు లక్ష్మీగౌతమ్, మాడిశెట్టి గోపాల్, అన్నవరం దేవేందర్ తదితరులు అభినందనలు తెలిపారు.

చికిత్సపొందుతూ ఒకరి మృతి

ఇల్లంతకుంట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంగమరెడ్డిపల్లె గ్రామానికి చెందిన పందుగు చక్రపాణి (43) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కొంతకాలంగా భార్య తల్లితో విభేదాలు నడుస్తున్నాయి. పెద్దల సమక్షంలో పలుసార్లు పంచాయితీలు జరిగాయి. కుటుంబ కలహాలతో మనస్థాపం చెందిన చక్రపాణి గురువారం క్రిమిసంహారక మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి అన్న అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలు చోరీ

జగిత్యాల క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని అరవింద్ నగర్, బంజరు దొడ్డి ప్రాంతాల్లో ఇంటి ఎదుట నిలిపి ఉన్న రెండు ద్విచక్ర వాహనాలు ఇటీవల చోరీకి గురయ్యాయి. బాధితులు రాజ్‌కుమార్, వసంత్‌రావు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్సై గీత కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు


చందపల్లిలో డబుల్ బెడ్ రూమును లబ్దిదారుడి చేత ప్రారంభింపజేస్తున్న మంత్రులు


పెద్దపల్లిలో సమీకృత కూరగాయల మార్కెట్‌కు శంకుస్థాపన, మహిళా పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు

(5వ పేజీ తరువాయి)

ప్రసవాలు జరుగుతున్నాయని, శిశువులకు ఉండే ఆరోగ్య సమస్యల పరిష్కారానికి డిఈఐసి ఏర్పాటు చేశామని, ఇప్పటి వరకు 20 మంది చిన్నారులకు చికిత్స అందించామన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల కంటే మెరుగ్గా ప్రభుత్వ ఆసుపత్రి పని చేస్తుందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 57వ మండలంగా 2001లో ఎలిగేడు ఏర్పాటైందన్నారు. ఎలిగేడు పోలీస్‌స్టేషన్ హామీ గత పాలకులు నిర్లక్ష్యం చేశారని, శ్రీధర్ బాబు నాయకత్వంలో ముఖ్యమంత్రిని ఒప్పించి పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసుకున్నామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి జూనియర్ కళాశాల మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు.

రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్దపెల్లి జిల్లాను ప్రథమ స్థానంలో నిలబెట్టేందుకు మంత్రి శ్రీధర్ బాబు నిరంతరం కృషి చేస్తున్నారని, అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రామగుండంలో మరో తహసిల్దార్, ఆర్‌డీఓ కార్యాలయం మంజూరు చేయాలని మంత్రిని కోరారు. రామగుండం నియోజకవర్గంలో 15 ఎకరాల్లో 600 కుటుంబాలకు పట్టాలిస్తామని, డబుల్ బెడ్ రూముల ఇళ్లను పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాదరావు మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణంలో 2018లో చేపట్టిన డబుల్ బెడ్ రూముల ఇళ్ల నిర్మాణాలు మాజీ ఎమ్మెల్యే నిర్లక్ష్యం వల్ల పూర్తి కాలేదని విమర్శించారు. అతను వ్యక్తిగత పనులకే ప్రాధాన్యం ఇచ్చాడని, మహిళా సంఘాల భవనాలకు మంజూరైన నిధులను అతను నిర్మించిన రహదారుల బిల్లులకు మళ్లించారని ఆరోపించారు. ధాన్యంలో కోతలపై మిల్లర్లను ప్రశ్నించినప్పుడు అప్పటి ఎమ్మెల్యేలకు డబ్బులు ఇచ్చామని మిల్లర్లు అన్నారని, ప్రస్తుతం కోతలు లేకుండా ధాన్యం కొనుగోళ్లు సాగుతున్నాయని అన్నారు.

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో నాలుగు పోలీస్‌స్టేషన్‌లను ఒకే రోజు ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కరీంనగర్ సుడా ఛైర్మన్ కే.నరేందర్‌రెడ్డి, కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీసీపీ కరుణాకర్, అదనపు కలెక్టర్లు డి.వేణు, జే.అరుణశ్రీ, రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, ఏసీపీ కృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అన్నయ్యగౌడ్, సీఐ సుబ్బారెడ్డి, తహసీల్దార్ యాకన్న, డిటి.కిరణ్‌కుమార్, ఎంపీడీఓ భాస్కర్‌రావు, పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఎస్సై

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు ఎస్‌ఐగా తనుగుల సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవం అనంతరం ఎస్సైని మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే విజయరమణారావు, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, సీపీ అంబర్ కిషోర్‌ఝూలు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దపల్లి రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాఘవపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు మమత అన్నారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయేరియా నిర్మూలనపై గ్రామాల్లో 45 రోజులపాటు కార్యక్రమం చేపడుతున్నట్లు వైద్యురాలు తెలిపారు. వైద్యురాలు మాట్లాడుతూ 5 ఏళ్ల లోపు పిల్లల్లో విరేచనాలు నివారించడానికి గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ముందస్తుగా అవసరమైన ఓఆర్‌ఎస్ ద్రావణం అందించనున్నట్లు తెలిపారు. చేతుల పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తి గత శుభ్రతపై గ్రామాల్లో సిబ్బంది అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.


మచ్చుపేటలో అతిసార వ్యాధిపై అవగాహన

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): మచ్చుపేటలో ఎంఎల్‌హెచ్‌పీ బొల్లం దీప్తి అతిసార వ్యాధిపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. విరేచనాలు అయినప్పుడు పిల్లలకు ఓఆర్‌ఎస్ ద్వారా కోల్పోయిన ద్రవాలు, ఎలక్ట్రోలైట్లను అందిస్తోందన్నారు. సిబ్బంది పుష్పలత, టీచర్ కళావతి, మాజీ సర్పంచ్ సతీష్ పాల్గొన్నారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): వర్షాల వల్ల గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో కలి కోట రామ్‌మోహన చారి అన్నారు. శుక్రవారం రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. డ్రైనేజీలలో పూడిక తీయాలని, వర్షపు నీరు రోడ్ల పై నిల్వ ఉండకుండ చూడాలని, గుంతలను పూడ్చివేయాలని, వర్షం నీరు చెరువు, కుంటలకు వెళ్లె విధంగా చూడాలని సూచించారు. ఎంపీవో ఉప్పు సుదర్శన్, పుట్నూర్, బసంత్‌నగర్ పిఎస్ వైద్యులు, అంగన్వాడి సూపర్‌వైజర్లు, టీచర్స్, ఏఎన్ఎంలు, మిషన్ భగీరథ ఏఈ, కార్యదర్శులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో అన్ని వర్గాలకు సముచిత న్యాయం

మంథని, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాలకు సముచిత న్యాయం లభిస్తుందని ఆ పార్టీ నేతలు శశిభూషణ్‌కాచే, వొడ్నాల శ్రీనివాస్, ఐలి ప్రసాద్, నూకల బానయ్య, పోలు శివ, కొత్త శ్రీనివాస్, మారగోని శంకర్‌గౌడ్‌లు వెల్లడించారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ పార్టీ పై మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు చేస్తున్న ఆరోపణలు మానుకోవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం పని చేసిన వారందరికి అవకాశం కల్పించడానికి మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక కార్యచరణ తీసుకుంటున్నారన్నారు. శ్రీనుబాబు చేసిన అనేక సేవా కార్యక్రమాలకు ప్రతిఫలంగా పార్టీ పదవీ లభించిందన్నారు. తమ పార్టీ అంతర్గత విషయాలపై ఆసక్తి ఎందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): దుద్దిళ్ళ కటుంబంపై మాజీ ఎమ్మెల్యే పుట్టమధు విమర్శలు సరికాదని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీ అంతర్గత విషయాలపై మాట్లాడడం సిగ్గుచేటన్నారు. పార్టీ కోసం కష్టపడిన నాయకులను అణగదొక్కిన చరిత్ర నీకే దక్కుతుందన్నారు. మల్యాల తిరుపతి, పిల్లిచంద్రశేఖర్, గడపకృష్ణమూర్తి, ఎం.ఏ రఫీక్, దాసరి గట్టయ్య, బోనాల సత్యం తదితరులున్నారు.

రత్నాపూర్‌లో రెవెన్యూ సదస్సు

రామగిరి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రత్నాపూర్ రైతువేదికలో శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. తహసీల్దార్ సుమన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి గ్రామంలోని సుమారు 35 మంది రైతులు వివిధ భూ సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారు. డిటి మానస, ఆర్ఐ మహేష్, రాజేష్ పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల్లో ఎంపిక పోటీలు

కాల్వశ్రీరాంపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, హకీంపేట్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల్లో 4వ తరగతి ప్రవేశాలకు ఎంపిక పోటీలు ఈనెల 18న మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ మహేష్ తెలిపారు. 4వ తరగతి స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రెండు ఫోటోలతో హాజరు కావాలన్నారు.

రామగిరి: నాగేపల్లి ఉన్నత పాఠశాలలో ఈనెల 17న మండల స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంఈవో కొమురయ్య ప్రకటనలో తెలిపారు.

మంథని: మండల స్థాయిలో ఈనెల 17వ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో లక్ష్మి తెలిపారు.

పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం

కాల్వశ్రీరాంపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బడి బాటలో భాగంగా ప్రధానోపాధ్యాయుడు అత్తె రాజారాం ఆధ్వర్యంలో సామూహిక అక్షారాభ్యసం నిర్వహించారు. మండల విద్యాధికారి మహేష్ మాట్లాడుతూ పాఠశాలలోని పిల్లలందరూ ప్రతిరోజు బడికి వస్తూ చక్కగా చదువుకోవాలని, తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు సుమారు 3 వేల విలువ చేసే పలకలు, పెన్సిల్స్, నోట్ బుక్స్, పెన్నులు అందించారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం సునీత, సీహెచ్ విజయ్‌కుమార్, ఐఈఆర్‌పి సుమలత, ఐకేపీ సీసీ శారద తదితరులు పాల్గొన్నారు.

ముత్తారం : స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఓడేడులో శుక్రవారం విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉచిత యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. మండల విద్యాధికారి నలుమాసు హరిప్రసాద్, డీపీఎం నాగేశ్వర్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.నారాయణరావు, ఏపీఎం పద్మ, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


జిల్లెల్లపల్లి (న్యూ) ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాసం

ముత్తారం మండలంలోని జిల్లెల్లపల్లి (న్యూ) ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుల్ల రాజేందర్, ఉపాధ్యాయుడు జినుకల వెంకటేష్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్‌పర్సన్ చొప్పరి రమ, అంగన్వాడీ టీచర్ సుజాత ఆధ్వర్యంలో పాఠశాలలో ఒకటవ తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో అక్షరాభ్యాసం నిర్వహించారు. పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్ పంపిణీ చేశారు. మండల విద్యాధికారి హరిప్రసాద్ ఉపాధ్యాయులను అభినందించారు.

పాలకుర్తి: మండలం పరిధిలోని జయ్యారం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, ఇంగ్లీష్ బోధన, ఉచిత యూనిఫామ్, శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే బోధన ఉంటుందన్నారు. ప్రధానోపాధ్యాయుడు కె క్రిష్ణరెడ్డి అక్షరాభ్యాసం చేయించారు.

కోల్‌సిటీటౌన్: గోదావరిఖని సంజయ్‌గాంధీనగర్‌లో ఇటీవల నూతన ఏర్పాటు చేసిన చైతన్య హైస్కూల్ గ్లోబల్ ఎడ్జ్‌ను రామగుండం ఎంఈఓ గడ్డం చంద్రయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల క్యాంపస్‌ను పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలకు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని చంద్రయ్య తెలిపారు.

కోల్‌సిటీటౌన్: అడ్డగుంటపల్లి, సాధనానగర్, మారుతీనగర్ పరిధిలో శుక్రవారం అమ్మ మాట-అంగన్‌వాడి బాట కార్యక్రమం నిర్వహించారు. 3 సంవత్సరాల నుంచి 6సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడి కేంద్రాలకు, పూర్వ ప్రాథమిక విద్య కోసం పంపించాలని అంగన్‌వాడి టీచర్లు ఇంటింటికి తిరిగి పిల్లల వివరాలు సేకరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జమున, అంగన్‌వాడి కేంద్రం టీచర్లు కె.రజిత, ఎస్.స్వరూప, జి.శారద, చిన్నారులు, పోషకులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ హయాంలోనే సమస్యలు పరిష్కారం


మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

యైటింక్లయిన్ కాలనీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా ఉన్న సమయంలోనే కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యాయని యూనియన్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం వీకేపీ గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. టీబీజీ కేఎస్ హయాంలో కారుణ్య నియామకాల ద్వారా 16వేలు, ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ల ద్వారా 4000 ఉద్యోగాల భర్తీ, లాభాల వాటా 16శాతం నుంచి 32 శాతానికి పెంపు, విద్యుత్ చార్జీల రద్దు సాధించినట్లు తెలిపారు. కోల్ ఇండియాలో లేని హక్కులను సింగరేణిలో అమలు చేసి చూపించిన ఘనత టీబీజీకేఎస్‌కు దక్కుతుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్నా కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, జాతీయ సంఘాలు కార్మికుల సమస్యలను విస్మరించిందన్నారు. గనులను వేలం వేయకుండా సింగరేణికి కేటాయించాలని టీబీజీకేఎస్ పోరాడిందని, ప్రస్తుతం గెలిచిన సంఘాలు వేలంలో పాల్గొనే కుట్ర చేస్తున్నాయన్నారు. తద్వారా ప్రైవేట్ సంస్థలకు లబ్ధి చేకూరేలా వ్యవహరిస్తున్నట్లు రాజిరెడ్డి తెలిపారు. సింగరేణిని కాపాడు కోవడం, కార్మికుల సమస్యల పరిష్కారం టీబీజీకేఎస్ దశల వారీ ఆందోళనలకు సిద్ధం అవుతున్నదని, కార్మికులు యూనియన్ చేసే ఆందోళనలకు మద్దతుగా నిలవాలని కోరారు. ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సత్యం, శ్రీనివాసరెడ్డి, వెంకటేష్, రవితేజ, రాములు, కాసిం, మోహన్, సురేందర్ పాల్గొన్నారు.



పాఠశాలల ప్రగతికి సింగరేణి సంస్థ కృషి

కోల్‌సిటీటౌన్, జూన్13(ఆంధ్రజ్యోతి): సింగరేణి పాఠశాలల ప్రగతి కోసం సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఎంతో కృషిచేస్తున్నారని జీఎం ఎడ్యుకేషన్(కార్పొరేట్) గుండా శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సింగరేణి హైస్కూల్ సెక్టార్-2 పాఠశాలను సందర్శించారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన సందర్భంగా ఉపాధ్యాయులను కలిసి పదో తరగతిలో మంచి మార్కులు సాధించినందుకు అభినందించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ నూతన విద్యాసంవత్సరంలో మంచి ఫలితాలు సాధించాలని, అందుకు సంస్థ తగిన సహకారం అందిస్తుందని తెలిపారు. కరస్పాండెంట్, పర్సనల్ మేనేజర్ ఎం.రవీందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏరియా హాస్పిటల్‌ను తనిఖీ చేసిన జీఎం

గోదావరిఖని, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ శ్రుకవారం ఏరియా హాస్పిటల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. మందుల స్టోరేజ్ స్థితి, పేషెంట్‌లకు అందిస్తున్న మందుల వివరాలను ఫార్మసి కౌంటర్ వద్ద తెలుసుకున్నారు. జీఎం మాట్లాడుతూ ఏరియా హాస్పిటల్, డిస్పెన్సరీలు కలుపుకొని 2500మందికి ఓపీ సేవలు అందిస్తున్నాయన్నారు. రెండు నెలల్లో దాదాపుగా రూ.15లక్షల ఖర్చు పెట్టి అందుబాటులో లేని మందులు కూడా లోకల్ పర్చేస్ ద్వారా తెప్పించి ఉద్యోగులకు మందుల కొరత లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. గడిచిన ఆరు నెలలలో ఏరియా హాస్పిటల్‌లో దాదాపుగా రూ.1.5కోట్ల వ్యయంతో మందులు ఉద్యోగులకు సరఫరా చేశామన్నారు. డీవైసీఎంఓ అంబిక, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

కనీస పెన్షన్ పది వేలు చెల్లించాలి

గోదావరిఖని, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వయోధికుల హక్కుల పరిరక్షణకు శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధానకార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్ మాట్లాడుతూ వృద్ధులు పోషించుకోలేని స్థితిలో ఉన్నవారికి వారి పిల్లలు భరణం చెల్లించాలని, సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు కనీస పెన్షన్ రూ.10వేలుచెల్లించాలని, ఆర్టీసీలో 50శాతం రాయితీ కల్పించాలన్నారు.

ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్న యాజమాన్యం

గోదావరిఖని, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మికులను, గుర్తింపు కార్మిక సంఘాన్ని అవమానపరుస్తూ సింగరేణి యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వానికి గులాంగిరి చేస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. శుక్రవారం భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన ఏఐటీయూసీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సింగరేణిలో ఉన్న స్కూల్స్‌లో విద్య బాగా లేదని లక్షలు వెచ్చించి హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ నగరాల్లో ప్రైవేట్ స్కూల్స్‌లో చదివిస్తున్నారన్నారు. ఈ విషయంపై స్ట్రక్చర్ సమావేశంలో సీబీఎస్‌ఈ సిలబస్‌ను సింగరేణిలో ప్రవేశపెట్టాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసిందన్నారు. రామగుండం, బెల్లంపల్లి రీజియన్‌లో సీబీఎస్‌ఈ ప్రవేశపెట్టడానికి అనుమతులు తీసుకుని శుక్రవారం సెక్టార్-3లో ప్రారంభించేందుకు యాజమాన్యం చర్యలు తీసుకున్నదన్నారు. ఆహ్వాన పత్రికలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పేర్లు పైన పెట్టి వారి కింద చిన్నగా సీఎండీ, డైరెక్టర్లు, గుర్తింపు, ప్రాతి నిధ్య సంఘాల పేర్లు ముద్రించి కార్మికులను, గుర్తింపు సంఘాన్ని అవమానపరిచే విధంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. సింగరేణి యాజమాన్యం, అధికారులు తమ విధానాలను మానుకోవాలని, లేకుంటే కార్మికుల్లో వ్యతిరేకత ఏర్పడుతుందని హెచ్చరించారు. మడ్డి ఎల్లాగౌడ్, ఆరెల్లి పోషం, జిగురు రవిందర్, బాజిసైదా, శ్రీను, సిర్ర మల్లికార్జున్, వెంకన్న, పాల్గొన్నారు.


సీతారామయ్యకు స్వాగతం పలుకుతున్న నాయకులు

సీఎంపీఎఫ్ సమస్యలపై వర్క్‌షాప్

గోదావరిఖని, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో శుక్రవారం ఆర్జీ-1, 2, 3, ఏరియాలకు సంబంధించిన సీఎంపీఎఫ్ జాయింట్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సమీక్షలో సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ శ్రీహరి పచౌరి, గోవర్ధన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉద్యోగుల పీఎఫ్ పెన్షన్ సంబంధించిన సమస్యల పరిష్కార మార్గం, పెన్షన్ చెల్లింపు, సెటిల్‌మెంట్, సవరణ, ప్రావిడెంట్ ఫండ్, ఉద్యోగుల పెన్షన్ విషయాల గురించి సీఎంపీఎఫ్ అధికారులకు వివరించారు. ఎస్ఓటూ జీఎం గోపాల్ సింగ్ మాట్లాడుతూ ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం పీఎఫ్ పెన్షన్ నిధి అందటంలో ఆలస్యం కాకుండా చూడాలని, పదవీ విరమణ అయిన వెంటనే సీఎంపీఎఫ్ నిధి ఉద్యోగికి అందేలా చూడాలన్నారు. పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కారం చేయాలన్నారు. పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, డీజీఎం(ఫైనాన్స్) ధనలక్ష్మిబాయి, డిప్యూటి పర్సనల్ మేనేజర్ నాగుల వేణు, సీనియర్ పర్సనల్ అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యపై సింగరేణి సీఎండీకి వినతి

గోదావరిఖని, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బీ జనక్ ప్రసాద్ శుక్రవారం గోదావరిఖనికి వచ్చిన సింగరేణి సీఎండీ బలరాంను ఇల్లందు క్లబ్‌లో కలిసి మాట్లాడారు. ప్రత్యేకంగా నాలుగు నుంచి ఐదు మెడికల్ బోర్డుల్లో రిఫర్ ఫర్ హయ్యర్ సెంటర్ కింద కార్మికులను ఎనిమిది నెలలుగా తిరిగి బోర్డుకు పిలవకపోవడం, జీతాలు, పెన్షన్ లేక ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. సమస్యను వెంటనే పరిష్కరించేందుకు మెడికల్ బోర్డు సమావేశాలు నిర్వహించాలని కోరారు. సులభ్ కార్మికుల సమస్యలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, వారికి మేలు చేసే విధంగా నిష్పక్షపాతంగా ఉండే ఏజెన్సీకి కాంట్రాక్టు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి, ఆర్జీ-1 ఏరియా వైస్ ప్రెసిడెంట్ సదానందం పాల్గొన్నారు.

చెత్తాచెదారం లేకుండా చర్యలు

పెద్దపల్లి రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాఘవపూర్ గ్రామంలో చెత్త చెదారం లేకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కార్యదర్శి తూముల రవి అన్నారు. శుక్రవారం గ్రామంలో వర్షపు నీరు నిల్వ ఉండే ప్రాంతం, మురికి కాలువల్లో ఉన్న చెత్త చెదారాన్ని సిబ్బందితో శుభ్రం చేయించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్, ఫాగింగ్ చేయిస్తున్నట్లు తెలిపారు.

కూలీలకు టోపీల పంపిణీ

పాలకుర్తి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : కుక్కలగూడూర్ గ్రామంలో ఉపాధిహామీ కూలీలకు రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ సేవ సమితి ఛైర్‌పర్సన్ మనాలిఠాకూర్ శుక్రవారం టోపీలన అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ కూలీకి వంద రోజుల పని కల్పించాలని, పని స్థలాల్లో ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలనే సంకల్పంతో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ పని చేస్తున్నట్లు చెప్పారు. పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మేడం బాపు, ఫీల్డ్ అసిస్టెంట్ సీపతి సతీష్ ఉన్నారు.

కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ


కిట్లను అందజేస్తున్న ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్

పాలకుర్తి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని ఈసాల తక్కళ్లపల్లి, కొత్తపల్లి, రామరావుపల్లె గ్రామాల్లో శుక్రవారం కల్లు గీత కార్మికులకు ఆరు పరికరాలతో కూడిన కాటమయ్య రక్షణ కిట్లను రామగుండం ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అత్యాధునిక పద్ధతుల్లో కాటమయ్య రక్షణ కవచాన్ని తయారు చేయించినట్లు పేర్కొన్నారు. ఈ కిట్లు గీత కార్మికుల రక్షణకు దోహదపడుతాయన్నారు. గీత కార్మిక సహకార సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల అభివృద్ధికి కృషి చేయాలి


మంత్రి శ్రీహరిని సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నేతలు

సుల్తానాబాద్, జూన్ 13: (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ కులస్తుల అభివృద్ధికి ప్రభుత్వ పరంగా కృషి చేయాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరిని కోరారు. రాష్ట్ర మంత్రి మండలిలో శ్రీహరికి స్థానం కల్పించిన సందర్భంగా శుక్రవారం మంత్రిని కలిసి సన్మానించారు. కార్యక్రమంలో బండి ప్రకాష్, బల్ల సత్తయ్య, గోపాల్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పాలకుర్తి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ముంజంపల్లి గ్రామంలో ఉపాధిహామీ పనులలో మేటుగా విధులు నిర్వహించిన బొమ్మగాని తిరుపతి ఇటీవల మృతి చెందాడు. గురువారం ఆయన తండ్రి బొమ్మగాని సత్తయ్యకు మండల ఉపాధిహామీ సిబ్బంది తమ వంతుగా రూ.15 వేలు ఆర్థిక సాయం చేశారు. ఏపీవో రమేష్, సీవో సుచరిత, టీఏలు పాల్గొన్నారు.

బస్‌పాస్ చార్జీలను తగ్గించాలి

కోల్‌సిటీటౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెంచిన బస్‌పాస్ చార్జీలను తగ్గించాలని, విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని టీఆర్‌ఎస్‌డీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వాసంపెల్లి ఆనంద్‌బాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బస్‌చార్జీలను పెంచడంతో పేద విద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్లి చదుకునేందుకు ఇబ్బంది పడతారన్నారు.

సామాజిక సేవలో లయన్స్‌క్లబ్ ముందంజ

సుల్తానాబాద్, జూన్ 13: (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ముందుంటుందని, అనేక వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తోందని జిల్లా కో ఆర్డినేటర్ మిట్టపల్లి ప్రవీణ్‌కుమార్ అన్నారు. పూసాలలో వెంగళ శంకరయ్య కుటుంబ సభ్యులు ఆయన జ్ఞాపకార్థం గ్రామ వైకుంఠ రథాన్ని లయన్స్‌క్లబ్ బాధ్యులకు శుక్రవారం అప్పగించారు. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతు క్లబ్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలలో వైద్య ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. క్లబ్ జిల్లా గవర్నర్ వెంకటేశ్వర్‌రావు, మాటేటి సంజీవ్ కుమార్, నీలయ్య, శ్రీనివాస్, జూలూరి అశోక్, అనిల్, గజబీంకార్ జగన్, జూపల్లి తిరుమల్ రావు పాల్గొన్నారు.

నియామకం

కోల్‌సిటీటౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఆమెన్ జస్టిస్ ఫర్ సిటిజెన్ హ్యూమన్ రైట్స్ అండ్ వరల్డ్ సోషల్ పీస్ కౌన్సిల్ జిల్లా డైరెక్టర్‌గా గోదావరిఖనికి చెందిన కైలాసకోటి శ్రీనివాస్ నియామకమైనట్లు జాతీయ ఛైర్మన్ డాక్టర్ ఉల్లెంగా నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకంతో డైరెక్టర్‌గా నియమించిన జాతీయ ఛైర్మన్ నాగరాజు, రాష్ట్ర డైరెక్టర్ ఆకుల స్వామి, జిల్లా ఛైర్మన్ పుల్లూరి నర్సింగరావుకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

కాల్వశ్రీరాంపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. నాయకులు మాట్లాడుతూ మోదీ 11 సంవత్సరాల పాలనలో మచ్చలేని పాలన అందించారన్నారు. జన్‌ధన్ ఖాతాలు, ఉజ్వలయోజన, ఆవాస్‌యోజన, అయోష్మాన్‌భారత్, జీడీపీ 10వ స్థానం నుంచి 4వ స్థానానికి రావడం సర్జికల్ స్ట్రైక్, ఆపరేషన్ సిందూర్ చేపట్టారన్నారు. ముల్కోజు వెంకటేశ్వర్లు, చంద్రమౌళి, జనార్దన్‌రెడ్డి, కాసాగోని నిర్మల, రాగుల రాజ్‌కుమార్, ఎండి.రఫీ, జంగా రాజయ్య, కూస రాజు, గుడ్ల నరేష్, బాలకృష్ణ, శివ, బేతి కుమార్, రాజన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

హవల్దార్ ఆరిఫ్ కు ఎమ్మెల్సీ అభినందన


ఆరీఫ్‌ను సన్మానించిన ఎమ్మెల్సీ మల్క కొమురయ్య

పెద్దపల్లిటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో సేవలు అందించిన పెద్దపల్లి వాసి భారత సేనలో హవల్దార్‌గా పని చేస్తున్న మహమ్మద్ ఆరీఫ్‌ను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య గురువారం రాత్రి బీజేపీ కార్యాలయంలో అభినందించారు. ఆపరేషన్ సిందూర్‌లో ఆయన చూపిన ధైర్య సాహసాలను కొనియాడారు. ఆరీఫ్ సేవలకు గుర్తింపుగా ఎమ్మెల్సీ మల్క కొమురయ్య ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సహాయం దేశ రక్షణలో ఆయన చేసిన సేవలకు గౌరవ సూచకంగా అందజేసినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవ రెడ్డి, నాయ కులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో షోటోకాన్ విద్యార్థుల ప్రతిభ

మంథని, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయస్థాయి బ్లాక్ బెల్టు పోటీల్లో మంథని షోటోకాన్ విద్యార్థులు బ్లాక్ బెల్టులు సాధించినట్లు కోచ్, జేకేఏ జిల్లా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కొండ్ర నాగరాజు గురువారం తెలిపారు. వడ్లకొండ శ్రీనిత, నల్లవెల్లి నిక్షేప్‌సాయి, పొట్ల శ్రావన్ కుమార్, రంగు శ్రీచరణ్, ఆరెపల్లి అర్జున్ ఆదిత్యలు బ్లాక్ బెల్టులు సాధించినట్లు తెలిపారు. వీరిని రాపోలు సుదర్శన్, నూకల బానయ్య, పర్శ బక్కయ్య, శంకర్‌గౌడ్‌లు అభినందించారు.